# కరెంట్ అఫైర్స్

## అన్నదాతకు 'పీఎం - ఆశా'

❖ రైతులకు కచ్చితంగా కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ) లభించేలా 'పీఎం – ఆశా' (ప్రధానమంత్రి అన్నదాత ఆయ్ సంరక్షణ అభియాన్) పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. 2018, సెప్టెంబరు 12న ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రి వర్గం ఈ పథకానికి ఆమోదం తెలిపింది.

❖ ఈ పథకం కోసం రెండేళ్లలో రూ. 15,053 కోట్లు కేటాయించారు. ఈ ఏడాదిలోనే రూ. 6,250 కోట్లు ఖర్చు చేస్తారు.

❖ పంట ఉత్పత్తుల సేకరణలో రైతులకు సరైన ధర లభించేలా చేయడమే ఈ పథకం లక్ష్యం. ఇప్పటివరకు కనీస మద్దతు పథకం (పీఎస్ఎస్) మాత్రమే అమల్లో ఉంది. ప్రస్తుతం కొత్తగా ధరలో లోటు చెల్లింపు పథకం (పీడీపీఎస్), ప్రైవేటు వ్యక్తుల ద్వారా సేకరణ, నిల్వ పథకం (పీపీఎస్ఎస్) అనే రెండు పథకాలను ప్రవేశపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వాలు వీటిలో దేని ద్వారానైనా రైతుల నుంచి పంట ఉత్పత్తులను సేకరించవచ్చు. అయితే ఈ రెండు పథకాలు నూనెగింజలు, కొబ్బరికి మాత్రమే వర్తిస్తాయి.

❖ దేశంలో ఇంకా విద్యుదీకరణకు నోచుకోని 13,675 కిలోమీటర్ల రైలు మార్గాన్ని 2021 – 22 నాటికి పూర్తి చేయడానికి వీలుగా రూ. 12,134 కోట్లు కేటాయిస్తూ కేంద్ర కేబినెట్ మరో నిర్ణయం తీసుకుంది.

❖ పూర్తిగా చెరకు నుంచి తయారు చేసి, పెట్రోలులో కలిపే ఇథనాల్ ధరను 25 శాతం పెంచడానికి ఆర్థిక వ్యవహారాల కేబినెట్ సంఘం (సీసీఈఏ) నిర్ణయించింది.

❖ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ) – విజయవాడ పేరును ఎన్ఐడీ అమరావతిగా మారుస్తూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. భోపాల్ (మధ్యప్రదేశ్), జోర్హాట్ (అసోం), కురుక్షేత్ర (హరియాణా)ల్లో ఎన్ఐడీల ఏర్పాటుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.

## ఆర్టీసీ చరిత్రలోనే ఘోర రోడ్డు ప్రమాదం

❖ తెలంగాణలోని జగిత్యాల జిల్లాలో ఉన్న సుప్రసిద్ధ కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలోని ఘాట్ రోడ్డు వద్ద 2018, సెప్టెంబరు 11న ఆర్టీసీ బస్సు 20 అడుగుల లోయలో పడిన ఘటనలో 60 మంది మరణించారు.

❖ ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఆర్టీసీ తరపున మరో రూ. 3 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

## మానవాభివృద్ధిలో మన ర్యాంకు 130

❖ ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపీ) 2018, సెప్టెంబరు 14న విడుదల చేసిన మానవాభివృద్ధి సూచీలో భారత్ 130వ ర్యాంకు సాధించింది. 2017 సంవత్సరానికి ప్రకటించిన ఈ ర్యాంకుల్లో నార్వే, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, ఐర్లాండ్, జర్మనీ వరుసగా తొలి అయిదు స్థానాల్లో నిలిచాయి.

❖ 189 దేశాలతో రూపొందించిన ఈ జాబితాలో బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లు వరుసగా 136, 150వ స్థానాల్లో నిలిచాయి.

❖ 1990లో 0.427 గా ఉన్న భారత హెచ్‌డీఐ విలువ 2017లో 0.640కు పెరిగింది. దీంతో తాజా జాబితాలో భారత్ మాధ్యమిక మానవాభివృద్ధి దేశాల కేటగిరీలో చోటు దక్కించుకుంది.

## ముఖ్యమంత్రి యువనేస్తం

❖ ముఖ్యమంత్రి యువనేస్తం వెబ్‌సైట్‌ను (www.yuvanestham.ap.gov.in) సీఎం చంద్రబాబు 2018, సెప్టెంబరు 14న ఉండవల్లిలోని ప్రజా వేదిక ప్రాంగణంలో ప్రారంభించారు. పోర్టల్‌లో వివరాలు నమోదు చేస్తున్నామని, అక్టోబరు 2న నిరుద్యోగులకు భృతి పంపిణీ ప్రారంభిస్తామని ఈ సందర్భంగా సీఎం వెల్లడించారు.

❖ ఈ పథకం ద్వారా 22 – 35 ఏళ్ల మధ్య వయసున్న నిరుద్యోగులకు ప్రతినెల రూ. 1000 చొప్పున అందిస్తారు. కనీస విద్యార్హత డిగ్రీ లేదా డిప్లొమా, తెల్లరేషన్ కార్డ్ ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా సాధికార సర్వేలో నమోదై, EKYC వెరిఫికేషన్ అయి ఉండాలి.



www.eenadupratibha.net

## సీజేఐగా జస్టిస్ రంజన్ గొగొయ్

- సుప్రీంకోర్టు 46వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ రంజన్ గొగొయ్‌ను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ 2018, సెప్టెంబరు 14న నియమించారు. ప్రస్తుత చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా తన వారసుడిగా గొగొయ్‌ను పేర్కొంటూ ప్రభుత్వానికి సిఫారసు చేసిన నేపథ్యంలో ఈ నియామకం జరిగింది.
- జస్టిస్ దీపక్ మిశ్రా అక్టోబరు 1న పదవీ విరమణ చేయనున్నారు. 3న జస్టిస్ గొగొయ్ భారత ప్రధాన న్యాయమూర్తిగా (సీజేఐ) ప్రమాణ స్వీకారం చేయనున్నారు.
- సీజేఐ పదవిలో నియమితులైన ఈశాన్య రాష్ట్రాలకు చెందిన తొలి న్యాయమూర్తి గొగొయ్ కావడం విశేషం. 2019, నవంబరు వరకూ గొగొయ్ పదవీ బాధ్యతలు నిర్వర్తిస్తారు.
- 1954, నవంబరు 18న జన్మించిన గొగొయ్ 1978లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. 2001లో గువాహటి హైకోర్టులో న్యాయమూర్తిగా నియమితులయ్యారు. తర్వాత పంజాబ్, హరియాణా హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2011లో పంజాబ్, హరియాణా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2012లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు.

## మిథాలీ రాజ్ ప్రపంచ రికార్డు

- మహిళల క్రికెట్‌లో అత్యధిక వన్డే మ్యాచ్‌ల్లో జట్టుకు నాయకత్వం వహించిన క్రికెటర్‌గా భారత కెప్టెన్ మిథాలీ రాజ్ ప్రపంచ రికార్డు సృష్టించింది.
- శ్రీలంకలోని గాలెలో 2018, సెప్టెంబరు 11న శ్రీలంక, భారత్ మధ్య వన్డే సిరీస్ జరిగింది. ఇది కెప్టెన్‌గా మిథాలీకి 118వ వన్డే. దీంతో ఇంగ్లండ్ క్రికెటర్ చార్లొట్ ఎడ్వర్డ్స్ పేరుతో ఉన్న రికార్డ్‌ను (117 మ్యాచ్‌ల కెప్టెన్సీ) మిథాలీ బద్దలుకొట్టింది.
- మిథాలీ రాజ్ తొలిసారి 2003 – 04 భారత జట్టుకు నాయకత్వం వహించింది. (వెస్టిండీస్ జట్టుపై) మిథాలీ నేతృత్వంలో భారత జట్టు రెండుసార్లు (2005, 2017) వన్డే ప్రపంచకప్ ఫైనల్స్‌కు చేరింది. మూడు ఆసియా కప్ టైటిళ్లు (2005, 2006, 2008) గెలిచింది.

## రష్యా భారీ సైనిక విన్యాసాలు

- 2018, సెప్టెంబరు 11న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లు రష్యాలోని వ్లాదివోస్టాక్ నగరంలో సమావేశమై అంతర్జాతీయ పరిస్థితులపై చర్చించారు.
- ఈ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా పాతికేళ్ల విరామానంతరం రష్యా తన సైనిక శక్తిని ప్రపంచానికి పరిచయం చేసింది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తర్వాత తొలిసారిగా మహాసైనిక విన్యాసాలను ప్రారంభించింది. రష్యా రక్షణ శాఖ ప్రకటన ప్రకారం మూడు లక్షల మంది సైనికులు ఇందులో పాల్గొంటున్నారు. వెయ్యి యుద్ధ విమానాలు, 36 వేల సాయుధ శకటాలు, చైనా, మంగోలియా దళాలు కూడా వారం రోజులపాటు నిర్వహించే విన్యాసాల్లో పాల్గొంటాయి.
- రష్యా తూర్పు ప్రాంతాన పసిఫిక్ తీరంలో వ్లాదివోస్టాక్‌లో ఈస్టర్న్ ఎకనామిక్ ఫోరమ్‌ను నెలకొల్పాలని పుతిన్ ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి చైనా మద్దతు తెలుపుతోంది. రెండు దేశాల మధ్య వాణిజ్యం ఈ ఏడాది చివరికి 100 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా

## 2018 యూఎస్ ఓపెన్

- జపాన్ క్రీడాకారిణి నవోమీ ఒసాకా (20) యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను నెగ్గి సంచలం సృష్టించింది. గ్రాండ్ స్లామ్ టైటిల్ గెలిచిన తొలి జపాన్ ప్లేయర్‌గా ఒసాకా చరిత్ర సృష్టించింది.
- ఫైనల్లో ఒసాకా 6–2, 6-4 తేడాతో సెరెనా విలియమ్స్‌ను (అమెరికా) ఓడించింది.
- నాలీ (చైనా 2011లో ఫ్రెంచ్ ఓపెన్, 2014లో ఆస్ట్రేలియన్ ఓపెన్) తర్వాత ఆసియా నుంచి గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన రెండో ప్లేయర్ ఒసాకా.
- యూఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను సెర్బియా క్రీడాకారుడు నొవాక్ జకోవిచ్ గెలుచుకున్నాడు. ఫైనల్లో 6–3, 7–6, (7/4), 6–3 తేడాతో జువాన్ మార్టిన్ డెల్‌పొట్రోను (అర్జెంటీనా) ఓడించాడు.

- నొవాక్ జకోవిచ్‌కు ఇది మూడో యూఎస్ ఓపెన్ టైటిల్. గతంలో 2011, 2015ల్లో జకోవిచ్ ఈ టైటిల్ నెగ్గాడు. అతడికి ఇది 14వ గ్రాండ్‌స్లామ్ టైటిల్.
- మొత్తంగా 14 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతో అత్యధిక టైటిళ్లు గెలిచిన ఆటగాళ్ల జాబితాలో రోజర్ ఫెదరర్ (20), రఫెల్ నాదల్ (17), అమెరికా క్రీడాకారుడు పీట్ సంప్రాస్‌తో కలిసి జకోవిచ్ మూడో స్థానంలో నిలిచాడు.
- యూఎస్ ఓపెన్ సింగిల్స్ టైటిళ్లను గెలిచిన జకోవిచ్, ఒసాకాలకు 38 లక్షల డాలర్లు (రూ. 27.40 కోట్లు), రన్నరప్‌లు డెల్‌పొట్రో, సెరెనాలకు 18 లక్షల 50 వేల డాలర్లు (రూ. 13.34 కోట్లు) నగదు బహుమతిగా లభించింది.
- 2018 యూఎస్ ఓపెన్ పురుషుల డబుల్స్ టైటిల్‌ను మైక్‌బ్రయాన్, జాక్‌సాక్ (అమెరికా జోడీ), మహిళల డబుల్స్ టైటిల్‌ను ఆష్లీ బార్టీ (ఆస్ట్రేలియా) – కోకో వాండెవె (అమెరికా) జోడీ నెగ్గింది. మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను బెథానీ మాటెక్ శాండ్స్ (అమెరికా) – జేమి ముర్రే (ఇంగ్లండ్) జోడీ నెగ్గింది.

**రచయిత: సీహెచ్. కృష్ణప్రసాద్**

www.eenadupratibha.net
www.eenadupratibha.net